
సాక్షి తిరుపతి

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో జాతీయ మీడియా సలహాదారు ఉన్నారు. - 8లో



గంగ.. అద్వితీయంగా

తెలుగుగంగ జలాలు రెండు పంటలకూ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. - 8లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

రేణిగుంట మండలంలోని మొలగమూడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కేఎస్.సత్యనారాయణ తెలిపారు. వివిధ ప్రాంతాలలోని పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులు భౌతిక, రసాయనిక శాస్త్ర ప్రయోగాలను ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ప్రదర్శించనున్నారని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ప్రయోగాలతో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమానికి న్యూఢిల్లీ జేఎన్‌యూ వైస్‌చాన్స్‌లర్, మాజీ ప్రొఫెసర్ శివ్ నాడార్ హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,077 మంది స్వామివారిని దర్శించుకోగా 24,427 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మార్చిలో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమలలో మార్చిలో జరగనున్న విశేష పర్వదినాలు, ఇతర కార్యక్రమాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. మార్చి 3న పల్స్ పోలియో. 6, 20 సర్వ ఏకాదశి, 8న మహాశివరాత్రి, 20 నుంచి 24వ తేదీ వరకు శ్రీవారి తెప్పోత్సవాలు, 25న తుంబురుతీర్థ ముక్కోటి, శ్రీలక్ష్మీ జయంతి నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ


చిత్తూరు అర్బన్: ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పలువురు మున్సిపల్ కమిషనర్లను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) కార్యదర్శి రాంబాబును శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, ఇక్కడ పనిచేస్తున్న ఆర్.రమేష్ బాబును జంగారెడ్డిగూడెం, అద్దంకిలో పనిచేస్తున్న ఎస్.అబ్దుల్ రషీద్‌ను వెంకటగిరికి, ఇక్కడ పనిచేస్తున్న బి.వెంకటరామయ్యను పెడనకు, తిరుపతిలో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న కిరణ్‌ను మార్కాపురానికి, తిరుపతి సీనియర్ ఆడిట్ అధికారి టి.సుధాకర్ రెడ్డిని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా, కుప్పంలో పనిచేస్తున్న సి.చరణ్ తేజ్ రెడ్డిని తిరుపతి అదనపు కమిషనర్‌గా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ బి నాగేశ్వర రావును కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

1 నుంచి రాగిపిండి



రాగిపిండి

తిరుపతి అర్బన్: పేదలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మార్చి 1వ తేదీ నుంచి రూ.11కే కిలో రాగిపిండి ఇవ్వడానికి సర్వం సిద్ధం చేసింది. ప్రతి డీలరు రాగిపిండి తప్పనిసరిగా రాగిపిండి పంపిణీ చేయాలని జిల్లా సివిల్ సప్లై అధికారి రాజారఘువీర్ ఆదేశించారు. జిల్లాకు తొలి విడతలో 290 టన్నుల రాగిపిండి వచ్చినట్లు జిల్లా సివిల్ సప్లై మేనేజర్ వై.సుమతి తెలిపారు.



ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టింది.. వినూత్న విధానాలకు శ్రీకారం చుట్టింది.. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తోంది..ఈ క్రమంలోనే దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా మందులను డోర్ డెలివరీ చేసేందుకు చర్యలు చేపట్టింది.. నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆర్థికభారం తప్పిస్తోంది.. ఈ మేరకు పోస్టల్ శాఖతో పకడ్బందీ ఒప్పందం కుదుర్చుకుంది. ఖరీదైన మందులను సైతం పక్కాగా ప్యాక్ చేయించి మరీ వ్యాధిగ్రస్తులకు చేరుస్తోంది.. ఈ క్రమంలో సర్కారు చిత్తశుద్ధిపై సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



ఇంటి వద్దనే మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఉమ్మడి జిల్లా సమాచారం	
మొత్తం పీహెచ్‌సీలు	119
విలేజ్ క్లినిక్‌లు	904
నిత్యం వచ్చే ఓపీలు	సుమారు 6వేలు
దీర్ఘకాలిక సమస్యలతో వచ్చేవారు	సుమారు 3వేలు

ఎన్‌సీడీ సర్వే ద్వారా గుర్తించిన దీర్ఘకాలిక రోగుల వివరాలు

వ్యాధి	చిత్తూరు	తిరుపతి
బీపీ	12,593	16,956
మధుమేహం	9,974	15,396
బీపీ, షుగర్ రోగులు	14,092	22,748
క్యాన్సర్	245	406

మెడిసిన్ @ డోర్ డెలివరీ

- దీర్ఘకాలిక రోగులకు భరోసా
- ఇంటి వద్దకే ఖరీదైన మందులు
- పోస్టల్‌శాఖతో వినూత్న ఒప్పందం
- పేదలకు తప్పిన ఆర్థికభారం
- సరికొత్తగా శ్రీకారం చుట్టిన ప్రభుత్వం



చిత్తూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సేవలు ఇంటి ముంగిటకే వచ్చాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు సొంతూరిలోనే అందుబాటులోకి వచ్చాయి. పేదలకు ఆరోగ్య భరోసా వచ్చింది. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న విధానాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వం తొలుత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజస్)సర్వేను పకడ్బందీగా నిర్వహించింది. అందులో భాగంగా సుమారు 1.86 లక్షల మందికి పరీక్షలు చేయించింది. మొత్తం 92,410 మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నట్లు నిర్ధారించింది. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బందిపడుతున్నవారిపై ప్రత్యేక దృష్టి సారించింది. వీరందరికీ అందిస్తున్న వైద్యసేవల వివరాలను ముందుగా మ్యాపింగ్ చేయించింది. బీపీ, షుగర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ తదితర బాధితులకు ఖరీదైన మందులను వ్యాధిగ్రస్తుల ఇంటికే పంపుతోంది. ఇందుకోసం పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఈ విధానంలో 245 మందికి ఇంటికే మందులు వస్తున్నాయి.

పోస్టల్‌తో ఒప్పందం ఇలా...

ఇంటికే మందుల పంపిణీకి ఆరోగ్యశాఖ అధికారులు పోస్టల్ విభాగంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఆయా మందులను సిద్ధం చేయించి, వాటిని మంచిగా ప్యాక్ చేసి విలేజ్ క్లినిక్‌లోని ఎంఎల్‌హెచ్‌పీకి అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మందులను ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా రోగుల ఇంటికే వెళ్లి అందజేస్తున్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆర్థికభారం తప్పుతోంది. వేలాది రూపాయల మందులు ఉచితంగానే అందుతున్నాయి. మెడిసిన్స్ కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకపోవడంతో రోగుల కుటుంబీకులు సైతం వ్యయప్రయాసలు పడాల్సిన పనిలేకుండా పోయింది.



ప్యాక్ చేసిన మందులు

సద్వినియోగం చేసుకోవాలి



దీర్ఘకాలిక రోగులకు మందులను డోర్ డెలివరీ చేస్తున్నాం. ఆయా మందులను పక్కాగా ప్యాక్ చేసి, ఏమాత్రం దెబ్బతినకుండా పోస్టల్ ద్వారా ఒప్పందం ప్రకారం ఎంఎల్‌పీహెచ్‌లకు అందిస్తున్నాం. అనంతరం స్థానిక వైద్య సిబ్బంది ఆయా మందులను రోగుల ఇంటికే వెళ్లి అందించేలా చర్యలు చేపట్టాం. అలాగే వాటిని ఎలా వాడాలో కూడా వివరిస్తున్నాం. వ్యాధిగ్రస్తులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

విలువైన మాత్రలు ఉచితంగా..



ఇది వరకు జబ్బు పడితే పట్టణానికి వెళ్లే వాళ్లం. పెద్ద వ్యాధులు వస్తే నానా అవస్థలు పడేవాళ్లం. వేలాది రూపాయల ఖర్చు అయ్యేది. ఇప్పుడు అలా లేదు. ఊళ్లోనే క్లినిక్ పెట్టారు. డాక్టర్లు ఇంటి కాడికే వచ్చి వైద్యం చేస్తున్నారు. పరీక్షలు చేసి విలువైన మందులను కూడా ఉచితంగా ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. షుగర్ మందులు ప్రభుత్వం పోస్టల్ ద్వారా ఇంటికే పంపింది. ఇది చాలా సంతోషంగా ఉంది. – ద్రాక్షాయణి, తిరుపతి

అభినందనీయం



ఇదివరకు మాత్రలను మెడికల్ షాపులకు వెళ్లి కొనాల్సివచ్చేది. ఇప్పుడు డబ్బులిచ్చి మాత్రలు కొనే రోజులు పోయాయి. ప్రభుత్వం ఇంటికే మాత్రలు పంపిస్తోంది. అది కూడా ఖరీదైన మందులు. డాక్టర్లు కూడా ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు. మా ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి అభినందనీయం.

– కృష్ణయ్య, తిరుపతి

పేదలకు మేలు...



జగనన్న ప్రభుత్వంలో పేదలకు మేలు జరుగుతోంది. ముఖ్యంగా మాకు వైద్య ఖర్చుల భారం తప్పింది. ఊళ్లోకి డాక్టర్లు రావడం కాదు..ఇంటికాడికే వస్తున్నారు. మంచిగా పరీక్షించి..మేలైన మందులు, మాత్రలు ఇస్తున్నారు. పేదల ఆరోగ్యాన్ని ఇంతలా పట్టించుకుని అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – గిరిజ, చిత్తూరు

ఎప్పటికప్పుడు అందిస్తున్నాం



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పకడ్బందీగా వైద్యసేవలు అందిస్తున్నాం. వారికి ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ ఉచితంగా మందును ఇంటికే పంపిస్తున్నాం. ఈ సేవలు అందించే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాం. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పోస్టల్ ద్వారా మందులు చేరుస్తున్నాం. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.– ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

రూ.18.6 కోట్లతో 186 దేవాలయాల నిర్మాణం



పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు



రామకృష్ణారెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

నాయుడుపేటటౌన్ : తిరుపతి జిల్లా పరిధిలోని పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో శ్రీవారి ట్రస్ట్ ద్వారా రూ.18.6 కోట్లతో 186 ఆలయాలు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టీ.రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మతల్లి ఆలయ హుండీ లెక్కింపునకు ఆయన ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఆలయాలు నిర్మాణం చేపట్టేందుకు ఎవరైనా 20 శాతం నిధులు పెట్టుకుని ముందుకువస్తే దేవదాయశాఖ నుంచి 80 శాతం నిధులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో 8 ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు రూ.8 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. మరో పది ఆలయాలకు ప్రతిపాదలు సిద్ధం చేశారని చెప్పారు. దేవదాయశాఖ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.3,31,592 వచ్చినట్టు దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తెలిపారు. దేవదాయశాఖ తిరుపతి ఇన్‌స్పెక్టర్ దినేష్‌కుమార్, ఈఓ శశాంక్, ఆలయ కమిటీ చైర్మన్ గంధవళ్లి సిద్ధయ్య, కమిటీ సభ్యులు ఆరవ భూమి శ్రీనివాసులురెడ్డి, దేవతకిషార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: అభినయ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జూలై 20 నుంచి 28వ తేదీ వరకు తిరుపతి మహతి వేదికగా నిర్వహించనున్న జాతీయస్థాయి నాటక, నృత్య పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి తెలిపారు. 9 రోజుల పాటు చేపట్టే ఈ నాటక, నృత్య పోటీలలో పౌరాణిక పద్యనాటకం, సాంఘిక నాటికలతో పాటు శాస్త్రీయ, జానపద బృంద నృత్యప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ప్రదర్శించే పద్యనాటకం 2 నుంచి 2.30 గంటల వరకు, సాంఘిక నాటికలు 45 నుంచి 60 నిమిషాల లోపు ఉండాలన్నారు. అలాగే నృత్య పోటీలు జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలలో ఉంటాయని, బృంద నృత్యంతో పాటు సోలో నృత్యాలు ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. గెలుపొందిన వారికి హనుమా అవార్డ్స్‌తో పాటు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9581154667, 9952006367 సంప్రదించాలని ఆయన కోరారు.

గుడిసెల పేరుతో ఆక్రమణలా?

- ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గుడిసెల ఏర్పాటు
- స్థానికుల ముసుగులో స్థానికేతరులు
- మద్దతు తెలిపి, అల్లర్లు సృష్టించిన వామపక్షాలు
- ఎట్టకేలకు గుడిసెల తొలగింపు



గుడిసెలు ఖాళీ చేయిస్తున్న అధికారులు, పోలీసులు



కరకంబాడి గుట్టపై గుడిసెలు ఖాళీ చేస్తున్న స్థానికేతరులు

రేణిగుంట: నిజంగా పేదలైతే వారికి అండగా నిలవాలి. అధికారులతో చర్చలు జరపాలి. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి. కానీ వామపక్ష పార్టీల నాయకులు అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని చెలరేగిపోయారు. అరకొర స్థానికులతో పాటు పెద్ద ఎత్తున స్థానికేతరులను పోగుచేశారు. వారిని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు ఏర్పాటు చేసుకునేలా ఉసిగొల్పారు. దాదాపు నెలరోజుల పాటు కరకంబాడి గుట్టపైనే ఉండేలా వారికి ఆశలు నూరిపోశారు. ఆపై నిరసనల పేరుతో అల్లర్లు సృష్టించడం అలవాటు చేసుకున్నారు. పలు దపాలు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో అధికారులు నిబంధనల మేరకు అక్రమ గుడిసెలను తొలగించారు.

లబ్ధి పొందినా ఆక్రమణలా?

రేణిగుంట మండలం, కరకంబాడి సర్వే నం .153–1లో గత నెల 26న సీపీఎం నేతృత్వంలో స్థానికేతరులు గుడిసెలు వేశారు. అప్పట్లో రెవెన్యూ, పోలీసు అధికారులు గుడిసెలు తొలగించాలని వారితో చర్చలు జరిపారు. అయితే వామపక్ష నేతలు ప్రజలను కొండగుట్టపైనే కాపురాలు ఉంచి ఆందోళనలను ఉధృతం చేశారు. ఈ విషయంపై జిల్లా అధికార యంత్రాంగం సీరియస్ అయ్యింది. మంగళవారం శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు పోలీసు బలగాలతో కలిసి వెళ్లి అక్రమంగా వెలసిన గుడిసెలను తొలగించారు. సుమారు 1,500 మంది ఇక్కడ తాత్కాలిక గుడిసెలు వేసుకోగా, వాటన్నింటినీ తొలగించి అక్కడున్న వారిని కిందకు దింపారు.

ఆక్రమణకు పాల్పడిన వారి వివరాలు	
అక్రమంగా పాకలు వేసుకున్న వారి మొత్తం సంఖ్య	1,500 మంది
'నవరత్నాలు–జగనన్న ఇళ్లు' పథకం కింద లబ్ధి పొందిన వారు	900
ఇతర జిల్లాలకు చెందిన వారు	400 మంది
వివరాలు తెలియని వారు	200 మంది

నిబంధనల మేరకే తొలగింపు



ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గుడిసెలు నిర్మించారు. ఇందులో సుమారు 1,500 మంది దాకా ఉన్నారు. వారందరి వివరాలను తీసుకుని విచారిస్తే స్థానికేతరులని తేలింది. ఎవరైనా అర్హులుంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత అధికారులు విచారించి 90రోజుల్లో ఇంటి స్థలాలు మంజూరు చేస్తాం. ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరవుతుంది. ఇప్పుడు ఆక్రమించుకున్న స్థలం ఓ ప్రైవేటు వ్యక్తి తనదని కోర్టుకు వెళ్లాడు. మాకు, ఆ వ్యక్తికి మధ్య కోర్టులో వాజ్యం నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో దౌర్జన్యంగా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేయడం మంచిది కాదు. నిరసనల పేరుతో శాంతిభద్రతల సమస్య సృష్టించడం అలవాటు చేసుకున్నారు. ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం.

– రవిశంకర్‌రెడ్డి, ఆర్డీఓ, శ్రీకాళహస్తి

మహాశివరాత్రికి ముస్తాబు

- జోరందుకున్న ఏర్పాట్లు
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ



గోపురానికి రంగులు అద్దుతున్న కార్మికుడు



ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



ధూర్జటి కళాప్రాంగణం వద్ద ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల పనులు యుద్ధప్రతిపాదికన సాగుతున్నాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరావు సూచనలతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులను వేగవంతం చేశారు. బ్రహ్మోత్సవాలకు లక్షలాదిగా విచ్చేసే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో ఏర్పాట్లు, క్యూలు, విద్యుద్దీపాలంకరణ, భక్తులు బస తీరేందుకు షెడ్లు, ధూర్జటి కళాప్రాంగణం, కైలాసం సెట్టు, శివపార్వతుల ఊంజల్‌సేవ సెట్టింగ్ తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. పార్కింగ్ కోసం స్వర్ణముఖి నది గొడ్డేరు ప్రాంతాన్ని శుభ్రం చేసి ఏ ర్పాట్లు చేస్తున్నారు. ధూర్జటి కళాప్రాంగణంలో వీవీపీలకు కారు పార్కింగ్, గోపురాలకు రంగులు అద్దే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయంలో రంగవల్లులు దిద్దుతున్నారు. తాగునీటిని అందించేందుకు లక్షకుపైగా వాటర్ బాటిళ్లు, మజ్జిగ, పాలు బిస్కెట్లు వంటివి సమకూర్చేందుకు టెండర్లను ఆహ్వానించారు. ఆలయం, నాలుగు మాడ వీధుల్లో ప్రత్యేకంగా అనేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలకు రంగులు అద్ది ఊరేగింపుకు సిద్ధం చేస్తున్నారు. రథాలను మరమ్మతులుచేస్తున్నారు. నూతన తెప్పలను నిర్మించారు. ట్రైల్ రన్ నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

వేడుకగా విద్యాగణపతి కల్యాణం




స్వామి వారి కల్యాణంలో అర్చకులు

కోట: విద్యానగర్ టీటీడీ రోడ్డులో ఉన్న విద్యాగణపతి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సిద్ధి, బుద్ధి సమేత విద్యాగణపతిస్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

రేణిగుంట: రేణిగుంట–పుత్తూరు మార్గం మండలంలోని మొలగమూడి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం.. ఏర్పేడు మండలం, అంజిమేడుకు చెందిన హరీష్(22), చరణ్(17) బైక్‌పై నారాయణవనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మొలగమూడి సమీపంలో ట్రాక్టర్ రివర్స్‌లో వస్తూ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి ఇద్దరు యువకులు కిందపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



తెలుగుగంగ నీటితో తొట్టంబేడు మండలంలోని శివనాథపాళెం గ్రామంలో సాగైన వరిపంట



తొట్టంబేడు మండలంలో ప్రవహిస్తున్న తెలుగుగంగ నీరు

గంగ..అద్వితీయంగా

- 2019–2024 వరకు రెండు పంటలకు గంగనీరు
- 37 ఏళ్ల చరిత్రలో ఇదే ప్రథమం

తిరుపతి అర్బన్: అసత్యాలతో ప్రజలను గందరగోళంలో నెట్టడం పచ్చపత్రికలకే చెల్లు. తమపై ఆశలు పెట్టుకున్న పార్టీలను అధికారంలోకి రప్పించేలా కుయుక్తులు పన్నుతూ అధికారపార్టీపై విషం చిమ్మడం అలవాటు చేసుకున్నాయి. ఇందులో భాగంగానే తెలుగుగంగ నీటి విడుదలపై విషం కక్కి రైతులను ఆవేదనకు గురిచేశాయి.

అసలు విషయం ఏంటంటే?

1987లో తెలుగుగంగ ప్రాజెక్టు పురుడు పోసుకుంది. 37ఏళ్ల చరిత్రలో చంద్రబాబునాయుడు 14 ఏళ్ల సీఎంగా కొనసాగారు. ఆయన ఏనాడూ ఖరీఫ్‌లో తెలుగుగంగనీటిని విడుదల చేసిన దాఖలాలు లేవు. కేవలం రబీలో తూతూమంత్రంగా నీటిని విడుదల చేసేవారు. ఆ తర్వాత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖరీఫ్‌లో 15 నుంచి 21 టీఎంసీలు, రబీ సీజన్‌లో 25 నుంచి 28 టీఎంసీల వరకు కండలేరు నుంచి తెలుగుగంగ కాలువకు నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుత రబీలో జిల్లా వ్యాప్తంగా 2.5 లక్షల ఎకరాలు సాగుచేస్తుండగా.. అందులో గంగ పరీవాహక ప్రాంతాల్లోని వరి రైతులకు ఎలాంటి ఢోకా లేకుండా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం తెలుగుగంగ కాలువలో 1.734 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి.

కరువు నాయుడు మా కొద్దు



రాష్ట్రంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పని చేశారు. ఆ కాలంలో వర్షాలు లేవు. రైతులు నానా ఇక్కట్లు పడ్డారు. అయితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏ నాడూ కరువు లేదు. రెండు పంటలను పండించుకుంటున్నాం. ప్రస్తుతం తెలుగుగంగ నీటితో మిరప పంటసాగుచేశాం.

–దొమ్మరాజు సత్యనారాయణరాజు, రాసునూరు రాజులపాళెం గ్రామం,పెళ్లకూరు మండలం

బాబు వస్తే కరువే!



నారా చంద్రబాబునాయుడు..కరువు ఇద్దరూ కవల పిల్లలుగా మేమంతా భావిస్తున్నాం. ఆయన ముఖ్యమంత్రి అయితే వర్షాలు ఉండవు. 2014–2019 వరకు రాష్ట్రంలో కరువు తప్పలేదు. 2004కి ముందే ఉమ్మడి రాష్ట్రంలోను చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ కరువు తాండవించింది. చంద్రబాబు నాయుడు పాలన వస్తే మళ్లీ కరువు వస్తుందని రైతులు గట్టిగా నమ్ముతున్నారు.

–సీహెచ్ విజయకుమార్, రైతు, బంగారుపాళెం,వెంకటగిరి

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని మోదుగులపాళెంకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పది మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ మేర్లపూడి మురుగప్ప మొదలి, శ్రీనివాస మొదలి, బాబు తదితర పది మంది నాయకులు పార్టీలో చేరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, రాంబత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక చేయూత



మృతుని భార్యకు నగదు చెక్కును అందజేస్తున్న ఎస్పీ

తిరుపతి క్రైమ్: అనారోగ్య కారణంగా మృతి చెందిన ఏఎస్ఐ రమేష్ కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ఆర్థిక చేయూత అందించారు. గత ఏడాది రమేష్ నాయక్ ఈస్ట్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబానికి జిల్లా ఎస్పీ పోలీస్ సంక్షేమ నిధి నుంచి రూ.50 వేల చెక్కును మంగళవారం అందజేశారు.

తిరుచ్చిపై శ్రీసూర్యనారాయణ స్వామి



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీసూర్యనారాయణ స్వామివారు

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామివారు మంగళవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. స్వామివారికి అభిషేక సేవలను నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం స్వామివారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జయకుమార్, సుభాస్కర్ నాయుడు, అర్చక స్వాములు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

– స్కూటరిస్ట్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ



వేలూరు సురేంద్ర (ఫైల్)

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నది కాజ్‌వే సమీపంలో రహదారిపై సోమవారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టిన ఘటన బైక్ నడుపుతున్న వేలూరు సురేంద్ర(38) మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం.. నాయుడుపేట పట్టణం లోని పిచ్చిరెడ్డితోపు వీధిలో నివాసముంటున్న సురేంద్ర మేనకూరు సెజ్ పరిధిలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం యథావిధిగా విధులు ముంగించుకుని రాత్రి బైక్‌లో నాయుడపేటకు వస్తున్నారు. అదే సమయంలో మేనకూరు వైపు వెళుతున్న ట్రాక్టర్ ఆతని బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సురేంద్రను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే సురేంద్ర మృతి చెందినట్టు నిర్ధారించారు. సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ గోపి ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం సురేంద్ర మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు మృతుని స్వగ్రామమైన కోట మండలం, అందలమాల గ్రామానికి తీసుకువెళ్లారు. మృతునికి భార్య గిరీషా, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు.

కంట్లో కారం చల్లి.. బ్లేడుతో దాడిచేసి



గాయపడిన రమేష్‌బాబు

పాకాల: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని ఆపి కంట్లో కారం చల్లి అతనిపై బ్లేడుతో దాడి చసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల పంచాయతీ, కరీంతుల్లాబాద్‌కు చెందిన ఎం.రమేష్ బాబు మదనపల్లి–2 డిపోలో ఆర్టీసీ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో ఇంటి నుంచి బయలుదేరాడు. పీటీ గ్రౌండ్ మైదానంలో ఇద్దరు వ్యక్తులు తనన్ని ఆపి తెలిసిన వారికి ఫోన్ చేయాలని సెల్‌ఫోన్ కావాలని అడిగారు. ఆపై ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి బ్లేడుతో రమేష్‌బాబుపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. గట్టిగా కేకలు వేయంతో అక్కడి చుట్టు పక్కల వారు స్పందించేలోపే దుండగులు పరారయ్యారు. దాడికి పాల్పడిన వారి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, లారీ

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై జిల్లా సివిల్ సప్లై అధికారులు మంగళవారం దాడులు చేసి సుమారు రూ.10 లక్షలకు పైగా విలువగల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా డీఎస్ఓ ఎం రాజారఘువీర్ కథనం.. సూళ్లూరుపేట నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి నెల్లూరువైపు వెళుతున్న ఓ లారీలో రేషన్ బియ్యం బస్తాలు ఉండడం గుర్తించారు. లారీ డ్రైవర్ షాకీర్‌ను విచారించగా బియ్యం బస్తాలు ఎవరివో తనకు తెలియదని, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు బియ్యం బస్తాలు తీసుకెళ్లాలని మాత్రమే చెప్పారని, నెల్లూరుకు వస్తే దిగుమతి చేయాల్సిన చోటు చెబుతామని చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. లారీలో 270 క్వింటాళ్ల రేషన్ బియ్యం (550) బస్తాలు అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని లెక్కగట్టారు. ఈ మేరకు డ్రైవర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టుకు తరలించారు. రేషన్ బియ్యాన్ని నాయుడుపేట సివిల్ సప్లై గోదాముకు తరలించారు. తనీఖిల్లో డీటీ జయరాజ్, డెటా ఎంట్రీ ఆపరేటర్ ప్రతాప్ పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

శ్రీకాళహస్తి: కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడులు చేసి నలుగురిపై కేసులు నమోదు చేసిన సంఘటన తొట్టంబేడు మండలం, కంచనపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. కంచనపల్లి పంటపొలాల మధ్య కోడిపందేలు సాగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోళ్లు, రూ.1,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. పందెం ఆడుతున్న అంజూరు, కోవనూరు గ్రామాలకు చెందిన నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం ప్రెస్ అకాడమీ చైర్మన్ దేవరపల్లి అమర్, జయలలిత సన్నిహితురాలు తమిళనాడుకు చెందిన శశికళ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గూడూరురూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు టూరిజం అండ్‌హాస్పిటాలిటీ సెక్టార్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని జూ పార్కు వద్ద ఉన్న భారత పర్యాటక శాఖ, ఏపీ పర్యాటకశాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్‌లెడ్ న్యూట్రిషన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , సీడప్ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ పాసైన 18–28 సంవత్సరాల నిరుద్యోగ యువత మార్చి 4వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 8143576866, 9100558006, 9701343846 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

1 నుంచి టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు మార్చి ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం వెనుక వైపు పరేడ్ మైదానంలో ప్రారంభమవుతాయి. ఈ పోటీలు మార్చి 18వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో క్రీడల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న ఉద్యోగుల పేర్లు, టీమ్‌లు, పోటీ షెడ్యూల్ తదితర వివరాలు తెలియజేస్తారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. ఇందులో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు నిర్వహిస్తారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత క్రీడల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మార్చి 3న జాతీయ పల్స్‌పోలియో



సమావేశంలో మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డి

తిరుపతి తుడా: మార్చి 3వ తేదిన జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి తెలిపారు. పల్స్ పోలియో ఏర్పాట్లపై తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పల్స్ పోలియోను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3వ తేదీ 23 రూట్లలో 207 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 5 సంవత్సరాల్లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను కచ్చితంగా వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఆ రోజు వేయించలేని పక్షంలో 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పరిశీలించి వేయించే బాధ్యత సిబ్బందిదేనని చెప్పారు. డీఐఓ శ్రీనివాస రెడ్డి, డీపీఎంఓ శ్రీనివాసులు, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది కోసం ప్రత్యేక గ్రీవెన్స్



వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీహరి

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్ డేకి స్పందన లభించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి నేతృత్వంలో నిర్వహించిన స్పందనకు మొత్తం 20 ఫిర్యాదులు అందాయి. తిరుపతి జిల్లా పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల పరిధిలో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది స్పందనలో పాల్గొని స్థానికంగా ఎదురయ్యే సమస్యలను డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచన మేరకు ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రతి ఫిర్యాదును రాష్ట్ర ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్కు పంపించనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి

నాగలాపురం: సురుటుపల్లి సర్వమంగళ సమేత శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో ఆలయ చైర్మన్ ఏవీఎం.బాలాజీ రెడ్డి, ఈఓ కే.రామచంద్రారెడ్డి సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ బుధవారం నుంచి మార్చి 10వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్టు తెలిపారు. సామాన్య భక్తులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సమీక్షలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆనంద్, ఎస్ఎం.సురేష్, జీ.మునివేలు, ప్రధాన అర్చకులు కార్తికేశన్, మునివేలు, సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ ఓబయ్య, ట్రాన్స్‌కో ఏఈ జైసాయి, వీఆర్వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.